క్లుప్తంగా

ఏప్రిల్ 23 నుంచి అమ్మవారి ఉత్సవాలు


మోదకొండమ్మతల్లి

సాక్షి, పాడేరు: చింతలవీధిలో కొలువుదీరిన మోదకొండమ్మతల్లి ఉత్సవాలను ఏప్రిల్ 24 నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు గ్రామపెద్దలు బుధవారం నిర్ణయించారు. ఈ సందర్భంగా బుధవారం జరిగిన కార్యక్రమంలో ఉత్సవ కమిటీని ఎన్నుకున్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా నీలకంఠం, ప్రధాన కార్యదర్శిగా నాగులు ఎంపికయ్యారు. ఏప్రిల్ 24, 25, 26తేదీల్లో మోదమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న వెంకటగంగరాజు, సర్పంచ్ హనుమంతరావు

జి.మాడుగుల: మండలంలో సొలభం పంచాయతీ ఎస్.కొత్తూరు గ్రామంలో మత్స్యదేవత జాతర ఉత్సవాల్లో భాగంగా మండల స్థాయి వాలీబాల్ పోటీలను వైఎస్సార్‌సీపీ నాయకుడు మత్స్యరాస వెంకట గంగరాజు, సర్పంచ్ ఐసరం హనుమంతరావు బుధవారం ప్రారంభించారు. పోటీల్లో మగతపాలెం టీమ్‌కు ప్రథమ స్థానం, తాసరుబయలు టీమ్‌లకు ద్వితీయ స్థానం దక్కాయి. విజేత టీమ్‌లకు ఉత్సవాల ముగింపు రోజు గురువారం నాడు నగదు బహుమతి, షీల్డులను అందజేయనున్నట్టు ఉత్సవ కమిటీ తెలిపింది.

అమ్మవారికి ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

చింతపల్లి: మండల కేంద్రంలోని ముత్యాలమ్మ ఆలయ గర్భగుడిని బుధవారం పున:ప్రారంభించారు. మరమ్మతుకు గురైన గర్భగుడిని స్థానిక యువకులు విరాళాలు సేకరించి పునర్నిర్మాంచారు.ఆలయాన్ని ఉగాది సందర్భంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. ఉగాది వేడుక పురస్కరించుకొని గురువారం చండి పారాయణ, చండి హోమం, నవగ్రహ శాంతి తదితర పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటి తెలిపింది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ గోత్ర నామములతో యగము జరిపించుకోవాలని కమిటి కోరింది. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన ఏర్పాటుచేశారు. బేతాలుడు, నాయుడు, నాగ భుషణం, గెమ్మెలి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం


ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

నబ్బువరం : ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరి దేవి క్షేత్రంలో లలితాంబికా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీ యంత్ర మహామేరు ఆలయం ముందు గోపూజతో ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం శ్రీమేరు మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన కలశాలను వేద మంత్రాల సహితంగా ప్రాణ ప్రతిష్ఠ గావించి, లలితాంబికా అమ్మవారిని భక్తులు తోడ్కొని వచ్చి నవయోని రేఖాచిత్రం మధ్యలో అధిష్ఠింపజేశారు. అనంతరం అమ్మవారికి క్షీరాభిషేకం, ఖడ్గమాల, సహస్రనామ కుంకుమార్చనలు నిర్వహించారు. గణపతి సహిత బాల హోమం జరిపారు. కార్యక్రమంలో ఆస్ట్రేలియా నుంచి వచ్చిన ప్రేమ్‌చంద్ మీనన్, పూణే నుంచి వచ్చిన పూనం ప్రధాన్, ముంబై నుంచి వచ్చిన అర్చన ఆర్య తోపాటు స్థానిక భక్తులు పాల్గొన్నారు.

వేడుకగా ఉగాది

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- వాడవాడలా పంచాంగ శ్రవణం


అరకులోయలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


చింతపల్లిలో నాగలికి పూజలు చేస్తున్న గిరిజనులు

అరకులోయ రూరల్: శోభకృత్ నామ తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను ఊరువాడ అంగరంగ వైభవంగా బుధవారం జరుపుకున్నారు. పర్వదినం పురస్కరించుకొని ఇళ్లను మామిడి తోరణాలతో అలంకరించారు. ఉదయం స్నానలాచరించి, కొత్త దుస్తులు ధరించి ఇష్టదైవానికి పూజలు చేశారు. షడ్రుచులతో చేసిన ఉగాది పచ్చడిని తయారు చేసి నైవేద్యంగా సమర్పించి, అనంతరం ఇంటిల్లిపాది స్వీకరించారు. ఉగాది పచ్చడిని ఇరుగుపొరుగు వారికి పంచి పండుగను ఆనందంగా నిర్వహించుకున్నారు. తెల్లవారుజాము నుంచి ఆలయాలకు భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, గోత్ర నామాలతో పూజాధికార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. ఆలయాల్లో పంచాంగ శ్రవణం జరిగింది. వివిధ రాసులు, నక్షత్రాల గమనాన్ని చదివి వినిపించారు. ఉగాది వేడుకలను స్థానికులు ఉత్సాహంగా జరుపుకొన్నారు.

అరకులోయ మండలంలోని అరకులోయ, తాంగులగూడ, యండపల్లివలస, పానిరంగిని, మాడగడ, సుంకరమెట్ట, కొత్తవలస, పప్పుడువలస తదితర గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

పెదబయలు: భీమలింగేశ్వర స్వామి ఆలయం, హరిహరపుత్ర అయ్యప్ప పీఠ, షిర్డీసాయి మందిరంలో పూజలు నిర్వహించారు. సాయి మందిరంలో పంచాంగ శ్రవణంలో భక్తులు పాల్గొని వేదపండితులు ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరం ఉగాది పచ్చడిని భక్తులకు పంచిపెట్టారు.మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

చింతపల్లిరూరల్: ఉగాది పర్వదినం పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గిరిజన రైతులు సంప్రదాయ పనిముట్లు, నాగలి తదితర సామగ్రికి పూజలు చేశారు.

రంపచోడవరం: స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఆలయ పూజారి అద్దంకి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

అడ్డతీగల: అడ్డతీగల శివారున వేంచేసిన బోడకొండమ్మ అమ్మవారి ఆలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజాధికాలు నిర్వహించారు. అమ్మవారికి పూజాధికాలు అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పవనగిరి క్షేత్రంలోని పలు దేవాలయాలను భక్తులు సందర్శించి పూజలు జరిపారు. పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య, విజయలక్ష్మి దంపతులు భక్తులకు ఉగాది పచ్చడిని అందజేశారు. దేవీ ఆలయం వద్ద భక్తులు వచ్చి కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

రాజవొమ్మంగి: స్థానిక షిర్డీసాయిబాబా, వేంకటేశ్వరస్వామి వారి ఆలయాల్లో ఉగాది వేడుకలు వైభవంగా జరిగాయి. ఉగాది పచ్చడిని భక్తులకు పంచిపెట్టారు. షిర్డీసాయిబాబా ఆలయంలో భానుమూర్తి పంచాంగ శ్రవణాన్ని వినిపించారు.

మోతుగూడెం: పొల్లూరు శ్రీ దుర్గా మల్లేశ్వరి ఆలయంలో బుధవారం లక్ష మల్లెపూలతో శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతోపాటు పంచామృత పూజ, పుణ్యావాహకం పూజలు జరిపారు. ఆలయ అర్చకుడు కుమారస్వామి శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

వీఆర్ పురం: మండల కేంద్రంలో గున్నంకొండ ముత్యాలమ్మ, గంగనమ్మ అమ్మవారుల జాతర వైభవంగా జరిగింది. మండల పరిధిలోని శబరి నది ఒడ్డున కొండ మీద వెలసిన ముత్యాలమ్మ, కొండ కింద గృహలో కొలువుదీరన గంగానమ్మ అమ్మవారులను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.దీంతో ఆ ప్రాంతమంతా భక్తులతో కిటకిటలాడింది . అలాగే శ్రీరామగిలోని శ్రీసుందర సీతారామ చంద్రస్వామి వారి ఆలయం, వీఆర్ పురం కట్ట ముత్యాలమ్మ అమ్మవారి ఆలయాల్లో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి.


రంపచోడవరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల పూజలు


అడ్డతీగలలో బోదకొండమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు


పెదబయలులోని షిర్డీ సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


రాజవొమ్మంగిలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


వీఆర్ పురం కట్ట ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


రాజవొమ్మంగిలో పంచాంగ శ్రవణం


లక్ష మల్లెపూలతో శివుడికి ప్రత్యేక పూజలు

రోడ్డుపై కూలిన భారీ చెట్టు తొలగింపు


ఊడపాలెం-వంజరి మార్గం మధ్యలో రోడ్డుపై కూలిన చెట్టును తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

జి.మాడుగుల: మండలంలో గెమ్మెలి పంచాయతీ ఊడపాలెం -వంజరి గ్రామాల మధ్య రోడ్డుకు అడ్డంగా కూలిన భారీ చెట్టును బుధవారం సర్పంచ్ సీదరి కొండబాబు అధ్వర్యంలో ప్రజలు తొలగించారు. ఈ రహదారిపై కూలిన భారీ చెట్టు శీర్షికతో 'సాక్షి'లో వార్త బుధవారం ప్రచురితమైంది. దీంతో వాహనచోదకులు పడుతున్న ఇబ్బందులపై గ్రామ వలంటీర్ రాజేంద్ర సంబంధిత సిబ్బంది, సర్పంచ్‌కు సమాచారం అందించారు. దీనిపై సర్పంచ్ సీదరి కొండబాబు స్పందించి రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టును తొలగించేందుకు చర్యలు చేపట్టారు. వాహన రాకపోకలు పునరుద్ధరించారు. దీంతో వాహనచోదకులు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వైభవంగా ముత్యాలమ్మ జాతర


మర్రిగూడెం ముత్యాలమ్మ జాతరకు తరలివచ్చిన భక్తులు

కూనవరం: ఉగాది పర్వదినం సందర్భంగా మర్రిగూడెం శ్రీ దేవీ ముత్యాలమ్మ అమ్మవారి దేవాలయంలో బుధవారం అమ్మవారి జాతర మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. అమ్మవారికి కుంకుమ పూజలు, అర్చనలు, గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. మొక్కులు తీర్చుకున్నారు. పల్లూరు, మర్రిగూడెం గ్రామానికి చెందిన ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

శరవేగంగా కల్వర్టు నిర్మాణ పనులు


లక్కవరప్పాడు వద్ద ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న కల్వర్టు


రాజవొమ్మంగి: మండలాన్ని కొయ్యూరు మండలంలోని పలు గ్రామాలతో కలిపే రహదారిపై కల్వర్టు పనులు జోరందుకున్నాయి. సుమారు రూ. 10 లక్షల వ్యయంతో ఈ కల్వర్టు నిర్మాణ పనులు మండలంలోని లక్కవరప్పాడు గ్రామం వద్ద పీఆర్. ఇంజనీరింగ్ అధికారుల ఆధ్వర్యంలో చకచకా జరుగుతున్నాయి. రాజవొమ్మంగి నుంచి కొయ్యూరు మండలం కొమ్మిక, కంతారం, బాలారం, ఆడాకుల, ఆర్.కొత్తూరు, కన్నంపేట, గొలుమండలం చోద్యం వంటి గ్రామాలకు వెళ్లేందుకు ఈ రహదారే దగ్గర దారి. ఆయా గ్రామాలకు వెళ్లే రహదారిపై వర్షాకాలంలో వరద నీరు పొంగి లక్కవరప్పాడు వద్ద పెద్ద పెద్ద గండ్లు పడుతుండడంతో పలు గ్రామాలతో రోజుల తరబడి సంబంధాలు తెగిపోతున్నాయి. స్థానికులు ఈ గండ్లపై కర్రలు, చెక్కలతో తాత్కాలిక వంతెనలు నిర్మించుకొని రవాణా అవసరాలు తీర్చుకొంటున్నారని 'సాక్షి'లో అనేక సార్లు కథనాలు వెలువడ్డాయి. దీనిపై స్పందించిన రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి దనలక్ష్మి రహదారిపై కల్వర్టు మంజూరుకు కృషి చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ప్రస్తుతం కల్వర్టు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎట్టకేలకు సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

28 నుంచి సీతారాముల కల్యాణ ఉత్సవాలు


ఉత్సవాల పోస్టర్లును ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి బాలరాజు, ఉత్సవ కమిటీ సభ్యులు

జి.మాడుగుల: శ్రీరామ నవమి పురస్కరించుకొని మండల కేంద్రంలో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు శ్రీ సీతారాములు ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు మాజీ మంత్రి, ఆలయ ధర్మకర్త మత్స్యరాస బాలరాజు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఎం.సింహాచలంరాజు, కార్యదర్శి గసాడి రెడ్డిబాబు తెలిపారు. స్థానిక రామాలయంలో బుధవారం సీతారాముల కల్యాణ మహోత్సవాల పోస్టర్లను వారు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 28న రామాలయం వద్ద శ్రీ భగవాన్ దామరాజు వెంకట యోగేంద్రుల శిష్యబృందం మోహన్‌దాస్, మత్స్యరాజు మాష్టర్ భజన కార్యక్రమం, 29న సీతారామ సమేత పూజా కార్యక్రమం, గ్రామ శాంతికి హోమం, 30న భారీ అన్నసమారాధన, అనంతరం తిరువీధి ఊరేగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. ఉత్సవాల్లో భాగంగా పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మాజీ ఎంపీపీ మత్స్యరాస వెంకటగంగరాజు, జీసీసీ కాఫీ గొడౌన్ ఇన్‌చార్జి ఎం.రామచంద్రరాజు, గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ నాయకులు పెదబంగార్రాజు, లక్ష్మీపతిరాజు, సింహాచలం, గిరి. కొండంటొర తదితరలు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరలు.. ఆనందంలో రైతులు


మిరియాలు


వారపు సంతలో విక్రయిస్తున్న పసుపు

మిరియాలు, పసుపు అమ్మకాల జోరు

సాక్షి, పాడేరు: ఏజెన్సీలోని గిరిజన రైతులు సాగు చేసిన వ్యవసాయ, వాణిజ్య పంటల అమ్మకాలు జోరందుకున్నాయి. ప్రస్తుతం మిరియాలు, పసుపు మార్కెట్ ప్రధానంగా జరుగుతుంది.పసుపునకు గత ఏడాది కన్నా ధరలు తగ్గాయి. కిలో రూ.55తో వ్యాపారులు సంతల్లో కొనుగోలు చేస్తున్నారు. జీసీసీ కిలో రూ.60ధర నిర్ణయించింది. ధర తక్కువగా ఉన్నప్పటికీ వ్యాపారులు మాత్రం భారీగానే పసుపును కొనుగోలు చేస్తున్నారు. అలాగే కాఫీ తోటల్లో అంతర పంటగా సాగు చేస్తున్న మిరియాల పాదులకు కూడా ఈ ఏడాది కాపు ఆశాజనకంగానే ఉంది. దీంతో పాదుల నుంచి మిరియాలను సేకరిస్తున్న గిరిజనులు వాటిని గోరువెచ్చని నీటిలో నానబెట్టి అనంతరం ఎండలో బాగా ఆరిన తర్వాత అమ్మకాలు జరుపుతున్నారు. ప్రస్తుతం మిరియాల అమ్మకాల సీజన్ జోరందుకుంది. ఈ ఏడాది సీజన్ ప్రారంభంలోనే కిలో రూ.400తో వ్యాపారులు కొనుగోలు ప్రారంభించగా, గత రెండు వారాల నుంచి కిలో రూ.450తో పోటాపోటీగా కొనుగోలు చేస్తున్నారు. జి.మాడుగుల సంతబయలులో మంగళవారం జరిగిన వారపు సంతలో మిరియాలు, పసుపు వ్యాపారం భారీగానే జరిగింది.

విస్తారంగా మొక్కజొన్న సాగు


రాజవొమ్మంగిలో మొక్కజొన్న సాగు


మొక్కజొన్న దిగుబడిని చూపిస్తున్న రైతులు

రాజవొమ్మంగి: మొక్కజొన్న పంట సిరులు కురిపిస్తోంది. దీంతో రబీ సీజన్‌లో (వేసవి పంటగా) తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఇస్తున్న మొక్కజొన్న సాగుకు గిరి రైతులు ఆసక్తి కనపరస్తున్నారు. తక్కువ పెట్టుబడితో ఆశాజనకమైన దిగుబడి, లాభాలు వస్తుండటంతో నీటి వనరుల వద్ద పంటను సాగుచేస్తున్నారు. రాజవొమ్మంగి మండలంలో దాదాపు 100 ఎకరాల్లో ఈ ఏడాది మొక్కజొన్న పండిస్తున్నారు. మొక్కజొన్న సాగు వల్ల పంట కోతకు వచ్చిన తరువాత వచ్చే కంకి పశుగ్రాశ కొరతను తీరుస్తుండడంతో రైతులు మొక్కజొన్న పంటకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

సాగు సులువు

ఖరీఫ్ సీజన్ ముగిసిన తరువాత వరి సాగు నేలల్లో మొక్కజొన్న వేస్తున్నారు. పంటకాలంలో (సుమారు 90 రోజులు) ఒకటి రెండు నీటి తడులతో పంట పండిస్తున్నారు. ఖాళీ ప్రదేశాల్లో పశువుల ఎరువు వెదజల్లి ఒకటి రెండు సార్లు లోతుగా దున్నాలి. ఈ విధంగా దుక్కు దున్నడం వల్ల మొక్కలు నీటి ఎద్దడిని తట్టుకొనే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు 30 నుంచి 40 క్వింటాళ్ల పొత్తులు దిగుబడి వస్తోందని, తద్వారా ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30వేలకు పైబడ ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు. ఖరీఫ్ పంటలకు వాడిన ఎరువుల ప్రభావం, సారం భూమిలో ఉండడంతో నామ మాత్రంగానే పంటకు యూరియా, పొటాష్ వంటి రసాయన ఎరువులు వాడుతున్నారు. చీడపీడలు కూడా తక్కువే అయినా ఎక్కడైనా కాండం, ఆకుతినే పురుగులు ఆశిస్తే క్రిమిసంహార మందులు తక్కువ మోదాదులో వాడుతున్నారు. ఏతావాత ఈ పంటపై పెట్టుబడి తక్కువ కనుక రైతులు వేసవిలో ఈ పంటపైనే మొగ్గుచూపుతున్నారు. మార్కెట్‌లో కిలో మొక్కజొన్న విత్తనాలు రూ. 500 నుంచి రూ.1000 పలుకుతోంది. ఎకరాలకు నాలుగు కిలోల విత్తనాలు వినియోగిస్తున్నట్టు రైతులు చెబుతున్నారు. రెండంగుళాల మొలక వచ్చిన తరువాత పలుచగా నీరు పారిస్తే మొక్కజొన్న మొలకలు ఏపుగా పెరుగుతున్నాయి. పశువుల నుంచి ఈ పంటను కాపాడుకొంటే వేసవిలో మొక్కజొన్న పంట సాగును మించింది లేదంటున్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన


తారురోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్‌లు, నేతలు

ముంచంగిపుట్టు: మన్యంలో గిరిజన గ్రామాలకు తారురోడ్డు నిర్మాణాలతో దశాబ్దాలా కల నేరవేరుతుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మల్లికార్జున్ అన్నారు. మండలంలోని జర్జుల పంచాయతీ బురదగుంట గ్రామానికి తారురోడ్డు నిర్మాణానికి సర్పంచ్‌లు, పార్వతమ్మ, భాగ్యవతి, ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, వార్డు సభ్యులు, నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఏజెన్సీ అభివృద్ధి జరుగుతోందన్నారు. శివారు గ్రామాలకు సైతం రోడ్డు సౌకర్యం కలగడం, సమస్య తీరడంతో పాటు రవాణా సదుపాయం కలగడంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో గృహ సారథుల కన్వీనర్ రాంప్రసాద్, ఉప సర్పంచ్ సాధురాం, నేతలు కొండలరావు, జగన్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం చర్యలు


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

కొయ్యూరు: మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని చింతపల్లి ఏఎంసీ చైర్‌పర్సన్ జె.రాజులమ్మ అన్నారు.

నల్లగొండలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలతో ఆమె కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఈ ప్రభుత్వం ముందు వరసలో ఉందన్నారు. డ్వాక్రా సంఘాల రుణమాఫీకి సంబంధించి సభ్యుల ఖాతాలకు ప్రభుత్వం ఏటా నిధులు మంజూరు చేస్తోందన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. సీసీ రాజుబాబు, వీవో అధ్యక్షురాలు అరుణకుమారి, సభ్యులు నాగమణి, నాగరత్నం, రాజేశ్వరి, శివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాలమ్మ పండగ

రోలుగుంట: మండలకేంద్రం రోలుగుంటలో పప్పల, తమరానవారి కళ్లాల వద్ద నూకాలతల్లి పండగను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

దాలిపేటలో..

మాకవరపాలెం: మండలంలోని దాలింపేటలో నూకాంబిక జాతరను ఘనంగా నిర్వహించారు. ఏటా ఉగాది నాడు ఈ జాతరను వైభవంగా నిర్వహిస్తారు. మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

చిత్తడి దారితో అవస్థలు


బురదమయంగా మారిన రొంపల్లి రహదారి

అనంతగిరి: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని శివారు ప్రాంతాల్లో మట్టిరోడ్లు చిత్తడిగా మారడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రొంపల్లి పంచాయతీ పెదరాభ వరకు ఉన్న రహదారి వర్షాలకు బురదమయంగా మారింది. దీంతో స్థానికులు అటువైపుగా గ్రామాలకు చేరుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. బురదలో ద్విచక్రవాహనాలు చిక్కుకుంటున్నాయని, జారిపడుతున్నామని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో రహదారి సౌకర్యానికి నిధులు మంజూరు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.